సంపుటి: 3 | సంచిక: 6

సెప్టెంబర్ - అక్టోబర్, 2015



# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

**నేను బ్రదుకు దినములన్నియు**
**కృపాక్షేమములే నా వెంట వచ్చును**



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

ప్రభువునందు ప్రియులైన వారికి నా శుభములు. మీరందరు క్షేమమని తలంచుచు, వ్రాయుచున్నాను. మానవుని జీవితం దేవుడు అనుగ్రహించిన కానుక. జీవితమును ఎన్నడూ, భారముగాను, బరువుగాను భావించకూడదు. ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం ఉంటుందని మరచిపోకూడదు. దేశంలోను, రాష్ట్రములలోను ప్రస్తుత పరిస్థితులను చూచినప్పుడు ఎంతో వేదన కరమైన సంగతి ఏమనగా ఆత్మహత్యలు. అనేకులు వారి ప్రతి సమస్యకు సులువైన పరిష్కారంగా దీనిని భావించుట. కానీ దీనంతటి భయంకరమైన నిర్ణయం మరొకటి లేదు, దీనివలన సృష్టించిన దేవునిని, అలాగే మనమీద ఆధారపడిన లేక మనలను ప్రేమించుచున్నవారిని బాధకు గురి చేసే విషయం. జీవితంలో అనేక సందర్భములలో బలవంతముగా మరణించవలెననే ఆలోచనలు బాధలలో నుండి కలుగుచున్నవే. ఇది ఎవ్వరికి, ఎన్నడూ కలగకూడని ఆలోచన. అయితే ప్రతి బాధకు ఒక పరిష్కారం, విడుదల ఉంటాయి, కనుక దానికొరకు ఓపికతో ఉండడం ద్వారా తప్పక విజయం సాధిస్తాము. బైబిల్ గ్రంథములో ఇలాంటి పరిస్థితులకు ఒక చక్కటి ఉదాహరణ కనబడుతుంది. అదే యోబు జీవితం, అతని జీవితంలో కలిగిన భయకరమైన బాధలకు అతని భార్య కూడా అతను చనిపోవుటే పరిష్కారం అని భావించింది. ఎందరు ఎన్ని మాటలు మాట్లాడినా యోబు భక్తుడు మాత్రము తనను విడిపించగలిగిన వాని మీద నమ్మకం పెట్టుకున్నాడు. అతని నమ్మకం తప్పిపోలేదు. ఒకానొక దినమున తన సమస్త బాధలకు పరిష్కారం లభించింది. కేవలం యోబుకు మాత్రమే కాదు. సృష్టించిన దేవుని విశ్వసించిన ప్రతి వ్యక్తి జీవితంలో బాధలకు పరిష్కారం దొరుకుతుంది. కాబట్టి యోబు జీవితమును గురించి యోబు గ్రంథమును చదవవలెనని నా మనవి. మనలో ప్రతి ఒక్కరికి ఎలాంటి బాధలలోనైన దేవుడు చూపించే పరిష్కారం కొరకు ఎదురుచూచే ధన్యత కలుగును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 3 | సంచిక: 6

సెప్టెంబర్ - అక్టోబర్, 2015

దేవుని

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...

✍ క్రమ "శిక్షణ" ........ 2
✍ ఇంతలోనే ఎంత మార్పు? ........ 5
✍ నోటి మాటలు (స్త్రీల ప్రత్యేకం) ........ 6
✍ సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 42వభాగము ........ 9
✍ సమూయేలు (బాలల శీర్షిక) ........ 11
✍ అమూల్యమైన వారు ........ 13
✍ నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
✍ సులభమైన ప్రార్థనా శక్తి ........ 17
✍ నీవు ఉన్నట్టా...? లేక ఉండి లేనట్టా...? ........ 19
✍ బైబిల్ క్విజ్-42 ........ 22
✍ జన్మదిన శుభాకాంక్షలు ........ 23

మా చిరునామా:
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# క్రమ "శిక్షణ"

**- బ్రదర్. ఎపఫ్రా**

ప్రతి పనికి శిక్షణ ఎంతో అవసరం. శిక్షణ లేకుండా ఏదైనా పనిని చేయటం ప్రారంభిస్తే దాని వలన నష్టం, ఎన్నో అనర్థాలు కలుగుతాయి. అందుకే అన్ని రంగాల్లోనూ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వారి వారి అవసరతల నిమిత్తము ట్రైనింగ్స్ ఇవ్వటం జరుగుతంది. మన దేశంలో కాని, ఇతర దేశాలలో కాని ప్రభుత్వాలు మిలటరీ కొరకు ఇచ్చే ట్రైనింగ్ ఎంతో ప్రాముఖ్యమైనదిగా భావిస్తారు. కఠోరమైన శిక్షణతో యుద్ధము కొరకు సైనికులను సిద్ధపరుస్తారని మనందరికి తెలిసిన సత్యం.

అయితే దానికంటే కూడా ఎంతో ప్రాముఖ్యమైనది దేవుని రాజ్యమును కట్టుట అనే కార్యక్రమం. దేవుని మాట వినక దూరమై సాతాను వాని దూతలకు సిద్ధపరచిన నిత్య అగ్నిగుండంలోకి త్రోసివేయబడుచున్న మానవాళిని, సువార్తను ప్రకటించుట చేత యుగయుగములు జీవించటానికి దేవుడు సిద్ధపరచిన పరలోక రాజ్యములోనికి నడిపించుటయే దేవుని రాజ్యమును కట్టుట. దేవుడు తన శిష్యులకు ఎన్నో విధములుగా శిక్షణనిచ్చి దేవుని రాజ్యమును కట్టుట కొరకు సిద్ధపరచటం బైబిల్ గ్రంథంలో మనం చూడగలం. వాటిలో ప్రాముఖ్యమైన కొన్ని విషయములను మనము ధ్యానించుకుందాం.

**1. అభ్యంతరములు కలిగించకుండా జీవించుట**

అభ్యంతరములు వచ్చుట సాధారణమైన విషయమేనని, అభ్యంతరములు రాకుండా ఉండుట అసాధ్యము కాని, అవి రావటానికి ఎవరు కారణమైతే వారికి శ్రమ అని ప్రభువు చెప్పటం జరిగింది. ఆయన శిష్యులుగా జీవించాలని ఆశిస్తున్న ప్రతి ఒక్కరు దేని విషయములోను అభ్యంతరంగా ఉండకుండా చూచుకొనవలెను. ఈ చిన్న వానిలో ఒకనికి అభ్యంతరము కలుగజేయుటకంటే మెడకు తిరుగటి రాయి కట్టబడి, సముద్రంలో పడవేయబడుట మేలు అని వ్రాయబడి ఉంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల మనసులు పాడు చేసేవారిగా ఉంటారు. అనవసరమైన విషయాలు వారితో మాట్లాడుతూ, అర్థం పర్థం లేని కండీషన్స్ వారికి పెడుతూ వారు భరించలేని బరువులు వారిపై మోపుతూ వారిని అభ్యంతరపరిచేవారిగా ఉంటారు. **తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి ఎఫెసీ 6:4** కనుక పెద్దలు ఎల్లప్పుడూ పిల్లల విషయమై శ్రద్ధ కలిగి ఉండాలని దేవుడు ఎంతగానో కోరుకుంటున్నాడు. వారికి ఆటంకం కలిగే విధంగా జీవించకూడదు.

పౌలు రోమా సంఘానికి ఉత్తరం వ్రాస్తూ ఇలా హెచ్చరించటం జరిగింది. కాగా మనమికమీదట ఒకనికొకడు తీర్పు తీర్చకుందుము. **ఇదియుగాక, సహోదరునికి అడ్డమైనను ఆటంకమైనను కలుగజేయకుందుమని మీరు నిశ్చయించుకొనుడి - రోమా 14:13** మన తోటి

వారికి ఆటంకం కలిగించే విధంగా జీవించ వద్దు అని హెచ్చరించటం కనపడుతుంది. ఒక మనుష్యుడు తన వ్యక్తిగతంగా దేవునికి విరోధంగా జీవించటం పాపం అయితే అతనిని బట్టి వేరొకరు అభ్యంతరపడే విధంగా ప్రవర్తించడం మరింత పాపము. కనుక మనము అభ్యంతరపరిచే విధంగా ఉండకూడదు.

**2. అందరితో సరియైన సహవాసం కలిగి ఉండుటకు క్షమించుడి**

నీ తోటి సహోదరుడు నీ యెడల తప్పిదము చేసిన యెడల అతనిని గద్దించుము. అతడు మారుమనస్సు పొందిన యెడల అతనిని క్షమించుము. కొందరు తమ తోటి వారి యెడల చాలా కఠినమైన వైఖరి కలిగి యుంటారు. ఎంత మాత్రము క్షమించటానికి ఇష్టపడరు. అది సరియైన విధానం కాదు. మనలను ఎంతగా గాయపరిచినప్పటికీ మనము క్షమించుట అనేది నేర్చుకొనినట్లయితే అది మనకు ఎంతో మేలు. నీ యెడల ఏడు సార్లు తప్పిదము చేసినను దేవుడు క్షమించుము అంటున్నాడు. ఏడు సార్లు మాత్రమే క్షమించమని కాదు కాని, యూదులకు ఏడు సంపూర్ణ సంఖ్య గనుక లెక్కలేనన్ని సార్లు క్షమించమని దేవుని యొక్క ఉద్దేశ్యం. మనం పేతురు విషయంలో ప్రభువు చెప్పిన మాటను బట్టి దీనిని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ప్రభువా ఎన్ని సార్లు క్షమించాలి? ఏడు సార్లా, అని పేతురు అడిగినప్పుడు ప్రభువు 490 సార్లు అని Unlimited అనే దానికి సాదృశ్యంగా చెప్పడం జరిగింది.(మత్తయి 18:21,22) మనుష్యులు క్షమించుటలో వెనకబడిపోవుటకు కారణం, క్షమించుట అంటే చేతకానితనం అని లేక క్షమిస్తే నష్టపోతాం అని ఎంతో మంది క్షమించటానికి ఇష్టపడరు. కానీ దేవుని ఉద్దేశ్యంలో క్షమించుట అనగా మనకి మనమే మేలు చేసుకొనుట. ఎవరు ఎదుటివారిని క్షమిస్తారో వారిని దేవుడు క్షమిస్తారు. ఎవడైనను తన పొరుగువానిని క్షమించకపోయిన యెడల దేవుడు వానిని కూడా క్షమించడు అని మత్తయి 6:14 లో వ్రాయబడి ఉంది.

త్వరగా క్షమించుటకు ఎల్లప్పుడూ శ్రద్ధ కలిగి ఉందుము. క్షమించుటలో ఎవరు ముందు ఉంటారో వారు అందరితో మంచి సంబంధం కలిగి ఉంటారు. అట్టి వారు దేవుని పని చేయుటకు ఎన్నో అవకాశాలు కలిగి ఉంటారు.

**3. విశ్వాసంలో ఎదుగుట**

దేవుని శిష్యులైనవారు విశ్వాసంలో ఎదుగుటకు ఎల్లప్పుడూ ఆసక్తి కలిగి ఉండవలెను. మొదటిగా విశ్వాసం అంటే ఏమిటి? హెబ్రీ 11:1 ప్రకారం విశ్వాసం అనేది నిరీక్షింపబడిన వాటి యొక్క నిజ స్వరూపం. కనిపించనివి ఉన్నాయి అనుటకు ఋజువు. నేను చూచిన తరువాత నమ్ముతాను అనేది ఎప్పటికీ విశ్వాసం కాదు. చూడని వాటిని ఒప్పుకొనుటయే విశ్వాసం. అయితే విశ్వాసం ఎలా కలుగుతుంది? దానికి జవాబు రోమా

10:17లో విశ్వాసం వినుట వలన కలుగుతుంది, వినుట దేవుని మాటను బట్టి కలుగుతుంది. విశ్వాసం కలిగి ఉండుటకు మరియు విశ్వాసంలో బలపడుటకు ఒకే ఒక మార్గము దేవుని మాట వినుట, చదువుట మాత్రమే. మనము విశ్వాసము కలిగి యున్నాము అని ఎలా తెలుసుకోగలము? (యాకోబు 2:17) విశ్వాసము క్రియలతో కూడినది కాని యెడల అది ఎందుకూ పనికిరాదు. విశ్వాసము క్రియలతో కూడినది అయితే అది కార్యసిద్ధి కలిగి సంపూర్ణ విశ్వాసం అవుతుంది. "ప్రాణము లేని శరీరము ఏలాగు మృతమో, ఆలాగే క్రియలు లేని విశ్వాసమును మృతము." విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టులైయుండుట అసాధ్యమని బైబిల్ చెప్పుచున్నది.

**4. చేయవలసినది మాత్రమే చేయుచున్నామని ఎరుగుట**

నిజమైన శిష్యుడు ఎల్లప్పుడూ తను దేవుని కొరకు చేసిన ఏ కార్యమును బట్టి అతిశయపడలేదు. ఎందుకంటే కేవలం బాధ్యత మాత్రమే నెరవేరుస్తున్నాము కానీ అంతకంటే ఎక్కువ ఏదీ చేయట్లేదు. ఆయన తన స్వరక్తమిచ్చి మనలను కొనిన సంగతి మనమెరుగుదుము. మన మీద ఆయన పూర్తి అధికారము కలిగి యున్నాడు. శిష్యుడు ఎల్లప్పుడూ గురువుని అనుసరించి జీవించుట అతని బాధ్యత. ఈ దినములలో దేవుని కొరకు చేస్తున్న కార్యములను హెచ్చింపుతోను, అతిశయముతోను చేయుట ఎంతో దుఃఖకరము. దేవుని పనిలో పాటలు పాడువారు, వాయిద్యములు వాయించువారు, అధికారము చేయువారు, వాక్యమును బోధించువారు, కానుకలు ఇచ్చువారు, దేవుని కొరకు ఏదో త్యాగము చేస్తున్నట్లుగా భావించుట సరియైనది కాదు అని గ్రహించవలెను. ప్రతివారు వారి వారి బాధ్యతలు మాత్రమే నెరవేరుస్తున్నారు అనే సంగతే వాస్తవం. దేవుని సంఘంలో పని చేస్తున్నప్పటికి అది మన ధన్యత అని భయముతో, వణుకుతో దానిని కొనసాగించవలెను. కీర్తనాకారుడైన దావీదు **నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము నీ ధర్మశాస్త్రము నా అంతర్యములోనున్నది - కీర్తన 40:8** అని చెప్పుచున్నాడు.

కనుక తన శిష్యులకు యేసయ్య ఇచ్చుచున్న ప్రాథమిక శిక్షణను మనము కూడా గ్రహించి ఎవరి ఆత్మీయ జీవితానికి అడ్డుబండగా ఉండక త్వరగా క్షమించే మనసు కలిగి విశ్వాసంలో వృద్ధి చెందుతూ నా బాధ్యతను మాత్రమే నెరవేరుస్తున్నానని గుర్తించి ముందుకు కొనసాగవలెను. ప్రతి విశ్వాసి తన ఆత్మీయ ప్రయాణంలో ఈ నాలుగు విషయాలను జ్ఞాపకం ఉంచుకొనవలెను. కారణం ప్రభువు పరలోకానికి ఆరోహణమై వెళ్ళేటప్పుడు సమస్త జనులను నా శిష్యులనుగా చేయమని చెప్పటం ద్వారా శిష్యరికపు శిక్షణలో మనం కూడా భాగమే అనే సంగతి గుర్తుంచుకొనవలెను.

ఇట్టి ధన్యతను దేవుడు దయచేయును గాక !

# ఇంతలోనే ఎంత మార్పు ?

ఒక యుక్త వయస్సు కలిగిన అమ్మాయి తనని తాను, చుట్టూ ఉన్న వారిని ద్వేషిస్తూ ఉండేది. కారణం ఆమె పుట్టుక నుండి అంధురాలు. ఒక వ్యక్తి మాత్రం ఆమెకి ఏ విధంగా సహాయపడగలను? అని ఆలోచిస్తూ, అనేక విషయాలలో సహాయపడుతూ ఉండేవాడు. అలా జరుగుచూ ఉండగా కొంత కాలమునకు అతడు ఆమెకు మంచి స్నేహితుడయ్యాడు. అతను ఆమె పట్ల కలిగియున్న బాధ్యతను గమనించిన ఆమె అతనిని ఎంతో ప్రేమించేది. నా కన్నులు వచ్చి లోకమును చూడగలిగితే నిన్ను వివాహం చేసుకుంటాను అని అతనితో చెబుతూ ఉండేది. ఒకరోజు ఆమెకు ఒకరు కన్నులు దానం చేయుట ద్వారా చూపును పొంది, అన్నిటిని చూడగలిగింది. అప్పుడు ఆ స్నేహితుడు నన్ను వివాహం చేసుకుంటావా? అని అడిగినప్పుడు ఆమె అతనిని తిరస్కరించింది. అతను కన్నీటితో అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఆమె అతనిని ఇష్టపడక పోవడానికి కారణం అతను గ్రుడ్డివాడు కావడం. కొన్నిదినములైన తరువాత ఆమెకు ఒక ఉత్తరం వచ్చింది. దానిలో "నా కళ్ళను జాగ్రత్తగా చూచుకో" ఇట్లు నీ నిజస్నేహితుడు అని ఉంది.



ప్రియమైన వారలారా! ఆ స్నేహితుడు స్నేహితురాలైన ఆమె చూపు పొందాలనే ఆశతో తన కళ్ళను దానం చేసి, లోకమును చూడగలిగేటట్లు చేశాడు. కానీ ఆమె గతమును మరిచిపోయి తన చూపునకు కారణమైన స్నేహితుణ్ణి తిరస్కరించడం మనకి అన్యాయమనిపిస్తుంది. అనేక సందర్భములలో మనము కూడా గతమును మరిచిపోయి ప్రవర్తిస్తున్న వారి వలె ఉన్నామా ?

# నోటి మాటలు

– సిస్టర్. విజయ

ఒకని మాటల ద్వారా వాని హృదయాంతరంగములో ఏమి ఉన్నదో తెలుసుకోవడానికి సాధ్యమవుతుంది. మంచి వ్యక్తి యొక్క మాటలు ప్రేమ, శాంతము, సమాధానము, ఐక్యతతో నిండి ఉంటాయి. అయితే దుష్టుని నుండి పలువిధములైన కొండెములు, ఇతరులను దూషించడం, శాపనార్థములు, నిరాశ, భయం అన్నీ వెలువడతాయి.

**బుద్ధిహీనుని పెదవులు కలహమునకు సిద్ధముగా ఉన్నవి.**
**బుద్ధిహీనుని నోరు వానికి నాశనము తెచ్చును**
**వాని పెదవులు వాని ప్రాణమునకు ఉరి తెచ్చును – సామె18:6,7**

పరిశుద్ధ గ్రంథంలో మహా జ్ఞాని అయిన సొలొమోను చెప్పిన మాటలను బట్టి బుద్ధిహీనమైన మాట అనగా మన నోరే మనలను నాశనం చేస్తుంది అని అర్థమౌతుంది. మాట్లాడవలసిన విషయముల కంటే అనవసరమైన విషయములే ఎక్కువ మాట్లాడి మన నాశనమును మనమే తెచ్చుకుంటున్నాము అనేది వాస్తవమైన విషయం. మంచి మాట సజ్జనులుగా, చెడ్డ మాట దుర్జనులుగా మారుస్తుంది.

**"నా ఇల్లంతటిలో నమ్మకస్తుడు"** అని దేవుని చేత సాక్ష్యం పొందిన ప్రవక్తయైన మోషేకి విరోధముగా అన్నయైన అహరోను, సహోదరియైన మిర్యాము మాట్లాడిన మాటలు యెహోవా వినెను. కారణం కూషు దేశపు స్త్రీని వివాహం చేసుకున్నందుకు. **మోషే కూషుదేశపు స్త్రీని పెండ్లి చేసికొని యుండెను గనుక అతడు పెండ్లి చేసికొనిన ఆ స్త్రీని బట్టి మిర్యాము అహరోనులు అతనికి విరోధముగా మాటలాడిరి – సంఖ్యా 12:1**

అహరోను యాజకుడు, మిర్యాము ప్రవక్త్రిని, వారు బుద్ధిహీనతతో, గర్వముతో **మోషే చేత మాత్రమే యెహోవా పలికించెనా? ఆయన మా చేతను పలికింపలేదా? అని మాట్లాడగా, యెహోవా ఆ మాట వినెను – సంఖ్యా 12:2,3** వెంటనే యెహోవా – మీరు ముగ్గురు ప్రత్యక్షపు గుడారమునకు రమ్మని ఆజ్ఞను ఇచ్చి యెహోవా మేఘస్తంభములో దిగి, ప్రత్యక్ష గుడారపు ద్వారము నొద్ద నిలిచి అహరోను మిర్యాములను పిలిచెను. వారిద్దరూ రాగా ఆయన నా సేవకుడైన మోషే **నా ఇల్లంతటిలో నమ్మకమైన వాడు. నేను గూఢభావములతో కాదు, దర్శనమిచ్చి ముఖాముఖిగా అతనితో మాటలాడుదును; అతడు యెహోవా స్వరూపమును నిదానించి చూచును. కాబట్టి నా సేవకుడైన మోషేకు విరోధముగా మాటలాడుటకు మీరేల భయపడలేదనెను. యెహోవా కోపము వారి మీద రగులుకొనగా ఆయన వెళ్ళిపోయెను. మేఘమును ఆ ప్రత్యక్షపు గుడారముమీదనుండి ఎత్తబడెను. అప్పుడు మిర్యాము హిమము వంటి తెల్లని కుష్ఠుగలదాయెను – సంఖ్యా 12:7-10**

 **మాటలు ఎంతో విలువైనవి. జాగ్రత్తగా వాడాలి.**

మనకు తలంపు ఆలోచన కలగక మునుపే ఇది తప్పా, ఒప్పా అని చూచుకొని నోట మాటగా మారక ముందే సరి చేసుకోవడం మంచిది. మిర్యాము, అహరోనులు ఆ విధంగా విరోధంగా మాట్లాడిననూ, మోషే ఏమీ మాట్లాడలేదు, సాత్వికంగా ఉన్నాడు. అయితే దేవుడు ఆ మాటలు విన్నారు. ఎదుటి వారు ఏమీ పట్టించుకోవట్లేదు, ఏమీ అనట్లేదు అని ఎవ్వరి మీదా బుద్ధిహీనతతో ప్రవర్తించకూడదు. గర్వముతో వెటకారముగా, హేళనగా ఎదుటివారిని కించపరిచే మాటలు మాట్లాడకూడదు. మిర్యాము మాట్లాడిన దానికి ప్రతిఫలంగా కుష్టరోగము కలిగింది. కుష్ఠము అనేది పాత నిబంధనా కాలంలో చాలా హీనమైనది, చనిపోవుటతో సమానమైనది. మరియొక విధంగా చూస్తే ప్రతిదినమూ చనిపోవుచూ బ్రతకడం అనేది చనిపోయిన దాని కన్నా ఎక్కువైనది. నోటి మాటలు అనేవి ఎంత ప్రమాదకరమైనవో గ్రహించిన వారమైతే అలాంటి మాటలు మాట్లాడాలంటేనే భయము కలుగుతుంది. గర్వము, అహంకారము కలిగిన హృదయముతో బుద్ధిహీనత కలిగిన మాటలు మాట్లాడక జాగ్రత్త కలిగి ఉండాలి.



మన మాటలు అనేక మంది జీవితముల మీద ప్రభావమును చూపిస్తాయి మంచి మాటల కన్నా, చెడ్డ మాటలు మాత్రం త్వరగా చాలా ఎక్కువ ప్రభావమును చూపుతాయి.

ఇశ్రాయేలు ప్రజలు వెళ్ళబోవు కనాను ప్రాంతమును వేగు చూడడానికి ఒక్కొక్క గోత్రములో నుండి ఒక్కొక్కరిగా 12 మందిని యెహోవా మాట చొప్పున మోషే పంపెను. వెళ్ళిన 12 మందిలో 10 మంది మాత్రం చెడ్డ సమాచారముతో సర్వసమాజమును కలవరపరచి, మోషే మీద సణిగేటట్లుగా చేశారు. 12 మందిలో ఇద్దరు మాత్రం చెప్పిన మాటలు, మంచి సమాచారం మాత్రం సర్వసమాజమును ప్రభావితం చేయలేదు.

**కాలేబు మోషే యెదుట జనులను నిమ్మళపరచి - మనము నిశ్చయముగా వెళ్ళుదుము. దాని స్వాధీనపరచుకొందుము. దాని జయించుటకు మన శక్తి చాలుననెను. అయితే అతనితో కూడ పోయిన ఆ మనుష్యులు ఆ జనులు మన కంటె బలవంతులు, మనము వారి మీదికి పోజాలమనిరి. మరియు వారు తాము సంచరించి చూచిన దేశమును గూర్చి ఇశ్రాయేలీయులతో చెడ్డ సమాచారము చెప్పి - మేము సంచరించి చూచిన దేశము తన**

**నివాసులను భక్షించు దేశము. దానిలో మాకు కనబడిన జనులందరు ఉన్నత దేహులు - సంఖ్యా 13:31-32. మరియు ఇశ్రాయేలీయులందరు మోషే అహరోనుల పైని సణుగుకొనిరి - సంఖ్యా 14:1**

12 మందిలో 10 మంది మనుష్యులు ఉన్నవి, లేనివి కూడా అనేకమైన చెప్పి, చెడ్డ మాటలు చెప్పి, సర్వసమాజము దేవుని శక్తిని నమ్మక తిరుగుబాటు చేసి, కృంగిపోయి, మోషే మీద సణగటానికి కారణమయ్యారు. **ఆ దేశమును గూర్చి చెడ్డ సమాచారం చెప్పిన మనుష్యులు యెహోవా సన్నిధిని తెగులు చేత చనిపోయిరి. అయితే ఆ దేశమును సంచరించి చూచిన మనుష్యులలో నూను కుమారుడగు యెహోషువయు యెఫున్నె కుమారుడగు కాలేబును బ్రదికిరి - సంఖ్యా 14:37**



చెడ్డ సమాచారము ఇశ్రాయేలు సమాజము మీద ఎంత ప్రభావమును చూపిందో మనం గ్రహించాలి. చెడ్డ సమాచారం చెప్పి అనేకులను కలవరపరిచే వారిగా ఉండకూడదు. అనేకుల జీవితములలో మంచి సమాచారం కన్నా చెడ్డ సమాచారం చెప్పడానికే ఆసక్తి ఉంటుంది.

ప్రతి మనిషిలో శ్రేష్ఠమైన స్వభావము, బలహీనతలు రెండూ ఉంటాయి. ఆ శ్రేష్ఠమైన స్వభావమును ప్రచురపరిచేవారిగా ఉండాలి. చెడ్డ సమాచారం ప్రచురపరిచేవారి జీవితములో నెమ్మది ఉండదు. కనుక సాధ్యమైనంత వరకు చెడ్డమాటలు పలకకుండా, చెడ్డ సమాచారం ప్రచురపరచకుండా మన నోటిని స్వాధీనపరచుకోవాలి. మనం క్షేమం, నెమ్మది, కలిగి సమాధానంగా, శాంతిగా జీవించాలంటే మంచి మాటలు, మంచి సమాచారం పలకాలి.

మన నోటి మాటకి దేవుడు అధికారమును ఇచ్చారు. కాబట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లడి ఆ అధికారమును దుర్వినియోగం చెసుకోక, సద్వినియోగం చేసుకుంటూ ఉండడం వలన గొప్ప మేలును పొందుతాము. నోటి మాటల ద్వారా కృపని పోగొట్టుకోకూడదు.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 42వ భాగము**

ఇంత జరిగినా పేరు పొందిన ఓ మిషనెరీ నుండి ముఖాముఖి విమర్శని ఎదుర్కొన్నాడు సుందర్. రత్నగిరిలో లాయర్ల కోసం ఓ ప్రత్యేక కూటాన్ని ఏర్పాటు చేశారు. వారంతా తమ తమ కుటుంబములతో దాదాపు 200 మంది సమకూడారు. కూటమైన తరువాత కొందరు సుందర్‌తో మాట్లాడాలని, మరి కొందరు ఆయనను పూజించాలని ముందుకు వచ్చారు. ఇద్దరు ముగ్గురు లాయర్లు ఆయన కాళ్ళపై సాగిలపడినపుడు సాధువు వెంటనే వారిని పైకి లేపి ఇలా చేయవద్దని చెప్పాడు. అయితే ఇంకా మిగిలిన వారు ఆయనను చుట్టి ముట్టినప్పుడు తమ పిల్లలను ఆయన చూడాలని తల్లులు వారిని తెచ్చినప్పుడు భక్తి భావంతోనే తన ఉత్తరీయంతో ఆ పిల్లల తలలు ముట్టి చిరునవ్వు నవ్వాడు. సుందర్ ఎడల ప్రజలు కనబరుచుచుండిన గౌరవము మితిమించినదని, అనవసరమని అనుకున్నాడు అక్కడే ఉన్న ఓ మిషనెరీ. ఇన్ని విధాలుగా ప్రజలనెందుకు నిన్ను ఘనపర్చనిస్తున్నావని కోపంతో సుందర్‌ని అడిగాడు. నేనీ ఘనతను కోరడం లేదు గాని ప్రజలకు నాపై నున్న ప్రేమ కొద్ది ఇలా చేస్తున్నారని సుందర్ చెప్పిన జవాబుకు ఆ మిషనెరీ సంతృప్తి చెందలేదు. ఈ ఘనతంతా నీది కాదు క్రీస్తుది అన్నాడు. సుందర్‌పై జరుగుచున్న ఈ దాడి విన్సెంట్‌కు ఎంతో ఇబ్బందికరంగా ఉంది. దీనికి సుందర్ ఏమని జవాబిస్తాడో అని ఆశ్చర్యపడుచుండగా తానెన్నడూ మర్చిపోలేని చక్కని జవాబు విన్నాడు. ఆ జవాబులో హేళన గాని, పరిహాసం గాని లేదు గాని అదెంతో మృదువుగాను, ఖచ్చితంగాను ఉంది.

సరే, మిషనెరీ గారూ! నాకీ ఘనత ఎందుకు వస్తుందో దానిని నేనెందుకు అంగీకరిస్తానో మీకు చెప్తాను. నా ప్రియమైన యేసు గాడిదను ఎక్కి యెరూషలేము వెళ్ళాడు. ప్రజలు తమ బట్టలు తీసి దారిపై పరిచారు. ఆ బట్టలపై గాడిదే నడిచింది గాని యేసుప్రభువు నడువలేదు. యేసుని మోసినందుకు గాడిదకు ఘనత దొరికింది. నేను అలాంటి గాడిదనే. నన్ను బట్టి కాదు గాని నేను క్రీస్తును ప్రకటించుచున్నందు వలననే ప్రజలు నన్ను ఘనపరచుచున్నారు.

నిండా 30 ఏళ్ళ కూడా లేని ఇతడు ఇన్ని రకాల ప్రజలపై ఈ రకమైన ప్రభావమును చూపడములో అతని నుండి వెలువడే ఆత్మీయ శక్తికి గల ఆధారమును కొంచెమైనా చూచే అవకాశం విన్సెంట్‌కు దొరికింది. ఒక స్థలంలో పెద్ద వరండా, ఒకే గదిని ఉన్న ఓ చిన్న ఇంటిని వీరికి ఇచ్చారు. ఆ ప్రాంతం నిండా పాములున్నాయి గనుక జాగ్రత్తగా ఉండమని చెప్పారు. నేను వరండాలో పండుకుంటానని చెప్పి ఆ గదిని సుందర్ కే పూర్తిగా ఇచ్చాడు విన్సెంట్. ఆ రాత్రి వేళ ఏదో అలికిడి విని టార్చి వేసి చూస్తే ఓ పాము అటు నుండి తోటలోనికి వెళ్ళిపోయింది. ఏమైనప్పటికిని

పండుకోవడానికి ముందుగా సుందర్ గదిలో ఏమైనా పాము ప్రవేశించిందేమో చూడాలని నెమ్మదిగా తలుపు తీసి మంచము మీదికి టార్చి వేశాడు. ఆ మంచం మీద సుందర్ కనబడకపోయేసరికి గాబరా పడ్డాడు. అంతలోనే తేరుకొని గది అంతా లైటు వేసి చూచినపుడు యోగముద్రలోని మౌని వలె సుందర్ ఓ మూల చేరి ప్రార్థనలో నిమగ్నుడై కూర్చుండినాడు. సంతోషంతో ఆయన ముఖం వెలిగిపోతుంది. ఆశ్చర్యపులకితుడౌతూ విన్సెంట్ బయటకు వచ్చాడు. అంత అర్థరాత్రి వేళ సుందర్ ఎందుకలా ప్రార్థిస్తుండినాడో తెలుసుకోవాలని మరునాడు ఉదయాన్నే ఆయనని అడిగాడు. వాక్యమును ప్రకటిస్తూ ఇలా తిరుగుచున్నప్పుడు ప్రార్థించుకోవడానికి సరిపోయినంత సమయం పగటి వేళ దొరకడం లేదు. అంతే గాక ఎన్నెన్నో కార్యక్రమాలు ఉంటున్నాయని సుందర్ చెప్పాడు. సుందర్ తో ఎన్నో చోట్లకు తిరగడం వలన ఈ పాటికే వారి మధ్య ఎంతో సాన్నిహిత్యం ఏర్పడింది. సుందర్ వ్యక్తిగత జీవితమును గూర్చి ప్రశ్నలడగడానికి విన్సెంట్ సాహసించగలిగాడు. ఇలాంటి అవకాశం మరల రాకపోవచ్చు కూడ. త్వరలోనే సాధువు మరింత దక్షిణంగా వెళ్ళబోవుచున్నందున విన్సెంట్ తిరిగి కళాశాలకు వెళ్ళబోవుచుండినాడు. బహిరంగ కూటములు నడిపించునపుడు సాధువు ప్రార్థించడాన్ని, చిన్న చిన్న గుంపులతో మాట్లాడునపుడు ప్రార్థించడాన్ని వారిద్దరు మాత్రమే ఉన్నప్పుడు తెల్లవారురుఝామునే లేవడం కూడా అతనికి తెలుసు. అయితే రాత్రి ఝాములలో అతడు చేసే రహస్య ప్రార్థన వీటన్నిటి కంటే వ్యత్యాసమైనది. దీనిని గూర్చి విన్సెంట్‌కేమీ తెలియదు గనుకనే ప్రార్థనలో ఇంత సమయం ఎందుకు గడుపుచున్నారని అడిగాడు. దీనికి సుందర్ దగ్గర సమాధానం సిద్ధంగానే యుండినది. ఎలాంటి దాపరికం లేకుండ వివరించాడు సుందర్. ప్రార్థనలో నిమగ్నమైపోవడానికి 15 లేక 20 నిమిషాలైనా పడుతుంది. ఆ తరువాతనే నేను ప్రార్థించనారంభిస్తాను గాని అప్పుడు ఇక నా పెదవుల నుండి మాటలు రావు. నా ప్రియుడైన యేసు నా ప్రక్కనే ఉన్నట్లుగా ఉంటుంది. ఆయన చేతులలో నా చేయి వేస్తాను. తెల్లవారుచుండగ ఆ ప్రార్థనలో నుండి లేచి రావాలంటే మహా కష్టంగా ఉంటుంది.

1918 జనవరి మొదటి తేదీన ఆయన మద్రాసు వస్తున్నాడని ప్రజలు ఎదురు చూస్తుండినారు. ఆ సాయంకాలం మెమోరియల్ హాల్లో ఆయన ప్రసంగించాలని నిర్ణయమైంది. ఆయనను చూడాలని ఆయన మాటలు వినాలని క్రైస్తవ సమూహాలు ఆత్రుతతో ఎదురుచూస్తుండినాయి. మద్రాసులో ఆయనను కలుసుకున్నవారు బహు కొద్దిమందే గాని, ఆయనను గూర్చి వారెంతో విన్నారు.

– సేకరించబడింది (ఇంకా ఉంది)



# సమూయేలు

పిల్లలూ బాగున్నారా? టీచర్స్ డే సెలబ్రేషన్స్ ఎలా జరిగాయి? మీ జీవితములో టీచర్స్ పార్ట్ చాలా ఇంపార్టెంట్. టీచర్స్‌ని గౌరవించాలి, వారి మాటలు శ్రద్ధగా వినాలి. మీ మంచి భవిష్యత్ కొరకు వారి మాటలు ఎంతో ఉపయోగపడతాయి. కానీ నేటి దినములలో టీచర్స్‌ని టీజ్ చేయడం ఎక్కువైంది. ఇది మనకి మంచిది కాదు.

సమూయేలు తన గురువుగారి మాట వినడం వలన ఎంత ప్రఖ్యాతి గడించాడో తెలుసుకుందామా!

అమ్మా! అమ్మా! అంటూ సమూయేలు ఏడ్చాడు. రాత్రి వేళ ఆ బాబుకి మెలకువ వచ్చింది. వాళ్ళ అమ్మ పరిగెత్తుకుంటూ వచ్చి సమూయేలును ఎత్తుకుంది. జోకొట్టి నిద్రపుచ్చింది. పాలు త్రాగుట మానిన తరువాత బాలుడైన సమూయేలుని దేవునితో చేసుకున్న నిబంధన చొప్పున మందిరంలో విడిచి పెట్టింది తల్లి. అక్కడ ఆడుకోవడానికి పిల్లలు లేరు, ప్రేమానురాగాలు పంచేవారు లేరు.

ఏలీ దైవజనుడు ఆలయంలో ప్రార్థనలు చేసేవాడు, బాగా ముసలివాడైపోయాడు. సరిగ్గా పనిచెయ్యలేకపోతున్నాడు. అతని కాళ్ళు ఊరికే అలసిపోతాయి. అందుకని నెమ్మదిగా నడుస్తాడు. కళ్ళు మసకబారాయి. ఏదీ సరిగ్గా కనిపించదు. సమూయేలు దేవుని మందిరంలో ఏలీ ఎదుట దేవునికి పరిచర్య చేస్తూ ఉండేవాడు. ఏలీకి సంతోషంగా ఉండేది. సమూయేలుకి రాత్రివేళ మెలకువ వచ్చినా భయం వేయడం లేదు. అమ్మా అని ఏడవడం లేదు. “సమూయేలు, ఈ పని చెయ్యి, ఆ పని చెయ్యి” అంటూ ఏలీ పిలుస్తూ ఉండేవాడు.

ఓ రాత్రి సమూయేలు పడుకున్నాడు. చెవులదాకా దుప్పటి కప్పుకొని కళ్ళు మూసుకొని నిద్రపోయాడు. “సమూయేలు!!!” సమూయేలు లేచి కళ్ళు నులుముకున్నాడు. “సమూయేలు!!!” అని మళ్ళీ వినిపించింది. నన్ను ఏలీ దైవజనుడు పిలుస్తున్నాడు అనుకున్నాడు. వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్ళి “ఏమిటి గురువుగారు అని అడిగాడు.

నేను పిలువలేదే వెళ్ళి పడుకో అన్నాడు ఏలీ. సమూయేలు వెళ్ళి మళ్ళీ పడుకుని దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకున్నాడు నిద్రపట్టింది.

“సమూయేలు, సమూయేలు” మళ్ళీ కేక వినిపించింది. వెంటనే లేచి ఏలీ దగ్గరకి వెళ్ళాడు. “ఇదిగో వచ్చాను ఏమిటి పిలిచారు?” అన్నాడు. “నేను పిలువలేదు. వెళ్ళి పడుకో

అన్నాడు ఏలీ రెండవసారి. సమూయేలు మళ్ళీ పడుకుని దుప్పటి కప్పుకొని కళ్ళుమూసుకున్నాడు నిద్రపట్టింది. "సమూయేలు, సమూయేలు" మళ్లీ పిలుపు వినిపించింది. లేచి ఏలీ దగ్గరకు పరిగెత్తాడు. "ఇదిగో వచ్చాను, మీరు పిలిచారు కదా" అన్నాడు. అప్పుడు ఏలీ, "సమూయేలు, నేను పిలువలేదు, దేవుడే నిన్ను పిలుస్తున్నాడనుకొంటాను. వెళ్ళి పడుకో, నిన్ను దేవుడు మళ్ళీ పిలిస్తే "చెప్పు ప్రభువా, వింటున్నాను అను" అన్నాడు.

సమూయేలు మళ్ళీ తిరిగి వెళ్ళి పడుకొని దుప్పటి కప్పుకొని వినసాగాడు. "సమూయేలు, సమూయేలు" మళ్ళీ ఎవరో పిలవడం వినిపించింది. సమూయేలు లేచి కూర్చున్నాడు. చెప్పు ప్రభువా! నేను వింటున్నాను అన్నాడు. అప్పుడు దేవుడు సమూయేలుతో మాట్లాడాడు. చెప్పినదంతా సమూయేలు శ్రద్ధగా విన్నాడు. ఆ తరువాత సమూయేలు దేవుణ్ణి ఎంతగానో ప్రేమించాడు.

అదే మొదటిసారి సమూయేలు దేవుని వాక్కు ప్రత్యక్షతను చూడడం, ఎంతో సంతోషించాడు. దేవుడు చెప్పినదంతా ఏలీకి చెప్పాడు. సమూయేలు దేవుని దయలోను, మనుష్యుల దయలోను వర్ధిల్లుచు, దాను మొదలుకొని బెయెర్షెబా వరకూ ప్రవక్తగా ఇశ్రాయేలీయులలో స్థిరపడెను.

పిల్లలూ! సమూయేలు బాలుడై యుండగానే అమ్మ ప్రేమకు దూరంగా ఉన్నాడు తన తోబుట్టువులను చూడాలని గానీ బంధువులను రక్తసంబంధులను కలుసుకోవాలని గాని తలంచలేదు. ఏలీ ఏది చెబితే అదే చేసేవాడు. ఆ మందిరావరణమే అతని ప్రపంచం.

పిల్లలూ! మరి మీరు మీ తల్లిదండ్రుల మాట గురువుల మాట అంటే సండే స్కూల్ టీచర్స్ మాట శ్రద్ధగా వినాలర్రా! సమూయేలు శ్రద్ధగా వినడం వలన దేవుని స్వరం వినే స్థాయికి ఎదిగాడు. లోకసంబంధంగా గొప్ప గొప్ప స్థానములలోకి వెళ్ళడానికి పట్టుదల, కృషి ఉంటే సాధ్యమవుతుంది. దేవుని స్వరం వినుటకు మాత్రం ఆయన మాట శ్రద్ధగా వినడం అవసరం. బాలుడైన సమూయేలు ఆ విధంగా జీవించాడు. మీరు కూడా బాల్యం నుండి అట్టి జీవితమును కలిగి ఉండాలని ఆశిస్తున్నాను.

– ప్రేమతో మీ అక్కయ్య

# అమూల్యమైన వారు

నేటి దినములలో ఆయన పరలోక సమాజాన్ని ప్రేమించే వారు ఎందరో ఉన్నారు గాని, ఆయన సిలువను మోసేవారు మాత్రం కొద్దిమందే. ఆదరణ కోరుకునేవారు కోకొల్లలు కాని శ్రమలను కోరుకునేవారు చాలకొద్దిమంది. ఆయనతో పాటు భోజనపు బల్ల దగ్గర కూర్చోవాలనుకునే వారెందరినో ఆయన కనుగొనగలడు కాని ఉపవాసం ఉండేవారు మాత్రము కొద్దిమంది. ఆయనతో ఆనందించాలని ఎందరో కోరుకుంటారు కాని ఆయన కోసం ఏదైనా సహించాలని అనుకునేవారు మాత్రం అతి కొద్దిమంది. ప్రభువైన యేసుతో కలసి అనేక అద్భుతములను చూచి ఆనందించిన ఆయన శిష్యులు ఆయన వేదనకరమైన పరిస్థితులను అనుభవిస్తునప్పుడు ప్రార్థించుటకు ఓపిక లేని వారిగా ఉన్నారు. **ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను. ఆయన ప్రార్థన చాలించి లేచి తన శిష్యులయొద్దకు వచ్చి, వారు దుఃఖము చేత నిద్రించుట చూచి మీరెందుకు నిద్రించుచున్నారు? శోధనలో ప్రవేశించకుండునట్లు లేచి ప్రార్థన చేయుడని వారితో చెప్పెను - లూకా 22:44-46.** ఆయన చేసిన అద్భుతములను ఎందరో గౌరవిస్తారు కాని ఆయన సిలువ అవమానాన్ని వెంబడించేవారు అతి తక్కువ మంది. ఆయన ద్వారా ఆదరణ, బాధలలో ఉపశమనము పొందుచున్నంత వరకు ఆయన్ని స్తుతించుచు, ఘనపరుచువారు ఎందరో. కొంచెము సమయం ఆయన కృప దూరమైతే ఆయనను దూషించి, వారిని వారే శపించుకుంటారు, ముఖము చిన్న బుచ్చుకుంటారు. కాని యేసుని ప్రేమించేవారు సొంత ఉపశమనం కోసమే గాక సమస్త శ్రమలయందును, హృదయవేదనలలోను యేసును ప్రేమిస్తూనే ఉంటారు. అసలు ఆయన వారికి ఎప్పుడూ ఏ ఆదరణ కలిగించక పోయినను వారి హృదయం లో దేవుని యెడల కృతజ్ఞతతో స్తుతులు చెల్లించుచునే ఉంటారు. ఎప్పుడూ దేవుని మంచితనమును గూర్చి మాట్లాడుతూ ఉంటారు. యేసు పవిత్ర ప్రేమ ఎంత శక్తిగలది, ఇందులో స్వలాభాపేక్షగాని, స్వార్థప్రేమ గాని మిళితమై ఉండవు. ఎప్పుడూ ఆదరణను, ఓదార్పును కోరుకునేవారు క్రీస్తు యెడల ప్రేమచూపడం కన్నా తమ్ముని తామే ప్రేమించుకోవడం కాదా ?

అందుకు పౌలు భక్తుడు ఫిలిప్పీ సంఘమునకు వ్రాసిన ఉత్తరములో ఈ విధంగా వ్రాయడం జరిగింది. **అందరును తమ సొంత కార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసుక్రీస్తు కార్యములను చూడరు - ఫిలిప్పీ 2:21**

ఏ ఆశ లేకుండా, ఏ లాభం ఆశించకుండా దేవునిని సేవించుటకు ఇష్టపడేవారు

ఎక్కడ ఉంటారు అని సాతాను ప్రభువుని ప్రశ్నించటం యోబు 1:9 లో మనం చూస్తాము. **అపవాది - యోబు ఊరకయే దేవుని యందు భయభక్తులు కలవాడాయెనా?** అన్నింటిని విడిచి జీవించే అంతటి ఆత్మీయుడిని కనుగొనడం అరుదైన విషయమే. నిజముగా ఆత్మలో దీనుడు, సమస్తాన్ని త్యజించినవాడు ఎక్కడ? "అట్టిది లేక అట్టివాడు ముత్యము కంటె అమూల్యమైనవారు."

ఒకడు లోకంలో ఉన్న సమస్త జ్ఞానాన్ని సంపాదించుకున్నా, ఎన్నో బోధలు చేయగల వాడైనా, గొప్ప భక్తిపరుడిగా పేరుగాంచినా అత్యంత ప్రాముఖ్యమైన విషయం మరి యొకటి ఎంతో అవసరం. తన్ను తాను త్యజించుకోవడం, స్వార్థం, అహం నుంచి వేరు అగుట. **అప్పుడు యేసు తన శిష్యులను చూచి - ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెను - మత్తయి 16:24** ఎల్లప్పుడు తాను ఇంకా ఏమిచేయలేకపోయాడో ఆలోచించుకునే వ్యక్తి తన్ను తాను సరిగా అంచనా వేసుకొనగలడు. ప్రభువు ఆజ్ఞాపించినవాటిని చేసిన తరువాత ఒక మనుష్యుడు ఏమి తలంచవలయునో ప్రభువు చెప్పడం జరిగింది. **అటువలె మీరును మీకు ఆజ్ఞాపింపబడినవన్నియు చేసిన తరువాత - మేము నిష్ప్రయోజకులమైన దాసులము, మేము చేయవలసినవే చేసియున్నామని చెప్పుడనెను - లూకా 17:10** ఈ విధంగా జీవించువాడు ఎంతో ధన్యుడు, అతని అంత ధనవంతుడు ఎవ్వరూ ఉండరు. ఏ మనుష్యుడు అతనికంటే శక్తిమంతుడు కాడు, ఎవడూ అతనంత స్వేచ్ఛగలవాడు అవ్వలేడు. ఎందుకంటే తన్ను తాను ఉపేక్షించుకున్నవాడు అతి దిగువ స్థాయిలో తనని తానూ ఉంచుకుంటాడు. అతనిని భయపెట్ట గలిగింది ఏదీ లేదు.

అట్టి జీవితమును మనమందరము కలిగి ఉందుము గాక !


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2015 అక్టోబర్ 2వ తేది ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవునిని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: **9666666249**

# "నా జీవితములో దేవుని మేలులు"

- **శ్రీనివాస్, కృష్ణాజిల్లా**

నా పేరు శ్రీనివాస్. మాది కృష్ణాజిల్లా నందిగామ దగ్గర తక్కెళ్ళపాడు. వ్యవసాయ కుటుంబం విగ్రహారాధన చేస్తూ ఉండేవాళ్ళం. నాకు ఒక అన్నయ్య. నా చిన్నతనంలో మా తండ్రిగారికి అనారోగ్యం కలిగి ఎంతకీ నయం కాకపోవడంతో మా ఊళ్లో ఉన్న క్రైస్తవులలో కొందరు చర్చికి రమ్మని, దాని ద్వారా దేవుడు నయం చేస్తాడని చెప్పడంతో మొట్టమొదటి సారి చర్చికి వెళ్ళటం జరిగింది. కానీ నామకార్థం గానే జీవించేవారము. ఇంట్లో పరిస్థితులు సమాధానకరంగా ఉండేవికావు. ఎప్పుడూ గొడవలు, అల్లర్లు, జరుగుతూనే ఉండేవి. ఇలా ఉంటూ ఉండగా మేము వెళ్ళే సంఘములోని గొడవల కారణంగా క్రైస్తవ్యమును విడిచి మరలా విగ్రహారాధనలోకి రావడం జరిగింది. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు గడచిన తరువాత మా బావగారి ద్వారా కుటుంబం అంతా హైదరాబాద్ రావడం జరిగింది.

మా తల్లిదండ్రులు హైదరాబాద్ వచ్చిన తరువాత కూడా హృదయంలో సమాధానం లేక చర్చికి వెళుతుండేవారు. మేము ఉంటున్న ప్రాంతానికి చర్చి దూరంగా ఉండటం వలన దగ్గర్లో ఏదైనా చర్చి కనిపిస్తుందేమోనని వెదుకుతూ ఉండగా భాగ్యలత మందిరంలో జరుగుతున్న ఆరాధనలో పాటలు వినబడి అక్కడికి వెళ్లటం జరిగింది. మా తల్లిదండ్రులు ప్రార్థనకు వెళుతున్నప్పటికీ నేను మాత్రం ఆఫీసులో జరిగే పూజా కార్యక్రమాలలో పాల్గొనే వాడిని. అయితే మా తల్లిదండ్రులు చర్చిలో చెప్పిన విషయాలను మేము ఇంట్లో ఉన్నప్పుడు మాకు చెబుతూ ఉండేవాళ్ళు. కొన్ని రోజుల తరువాత నేను పనిచేస్తున్న ఆఫీసులో కూడా తీసుకువచ్చిన బంధువుల ద్వారా సమస్యలు కలిగి నాకు సమాధానం లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మా తల్లిదండ్రులు పదే పదే చర్చి విషయాలు, నెమ్మది, సమాధానం గురించి మాట్లాడుతున్నప్పుడు నాకు కూడా చర్చికి వెళ్ళాలనిపించి చర్చికి రావడం జరిగింది. మొదటిరోజు వాక్యం అయిపోయిన తరువాత దైవసేవకులు నా దగ్గరకు వచ్చి పరిచయం ఉన్న వ్యక్తిలాగా పలకరించటం, ప్రేమగా మాట్లాడటం నన్ను బాగా ఆకర్షించింది. ఆ తరువాత నుంచి చర్చికి క్రమంగా వెళుతూ యేసుప్రభువును గురించి ఎక్కువగా తెలుసుకోవడం జరిగింది. అందరు దేవుళ్ళ లాగానే యేసుప్రభువు కూడా ఒక దేవుడు, అది ఒక మతం అనే నా ఆలోచనా విధానమును మార్చుకొని, ఈయనే నిజమైన దేవుడు అని ఎరిగి పాపక్షమాపణ నిమిత్తం మారుమనస్సు పొంది బాప్తిస్మం తీసుకోవడం జరిగింది. పరిచర్యలో సహోదరులు చూపుతున్న ప్రేమ ద్వారా దేవునిలో మరింతగా నిలిచి ఉండటానికి, ఆయన పనిలో నా వంతుగా ప్రయాసపడటానికి దేవుడు కృప చూపించాడు.

వివాహ విషయంలో కూడా దేవుని విశ్వసించిన అమ్మాయిని వివాహం చేసుకోవడానికి దేవుడు కృప చూపించాడు. సంతానంగా ఒక కుమారుని అనుగ్రహించాడు. చేస్తున్న పనిలో దేవుడు సమృద్ధిని అనుగ్రహించి, లేమి లేకుండా చేశాడు. మా అన్నయ్య, కుటుంబం కూడా దేవునిలోనికి నడిపించబడాలని ఆశిస్తున్నాను.

బ్రతుకు దినములన్నియు నేను నా కుటుంబము దేవుని పనిలో నమ్మకంగా, యధార్థంగా పనిచేయాలని మా కొరకు ప్రార్థించగలరు.


## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

## ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

అందరూ ఆహ్వానితులే....!

వివరములకు:
9666666249 | 040-24202227

# సులభమైన ప్రార్థనా శక్తి

**పట్టుదల కలిగిన ప్రార్థన:-**

బ్రతిమాలు ప్రార్థన అని కూడా పట్టుదల కలిగిన ప్రార్థనను అంటారు. ఇది మౌనముగా ఉండక, ఆశ వదలకుండా ప్రార్థిస్తూనే ఉంటుంది. కొన్నిసార్లు ఎవరైనా వ్యక్తుల గురించి, పరిస్థితుల గురించి, ఏదైనా విషయం గురించి హృదయములో ఒత్తిడి కలుగుతుందంటే పరిశుద్ధాత్మ దేవుడు పట్టుదలతో గోజాడు ధోరణిలో మనలను ప్రార్థన చేయమంటున్నాడని అర్థం. మన కోరికను దేవునికి విన్నపరూపములో ప్రార్థించి, ఆయన జవాబు ఇచ్చేంత వరకు, జవాబు నిమిత్తమై ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుట, పట్టుదల కలిగి ఉన్నామనుటకు ఒక మార్గము. పట్టు వదలని ప్రార్థన అనునది, పట్టువిడువని కృతజ్ఞతలు తెలుపు రూపం దాలుస్తుంది. మనలో దేవుడు చేయ తలంచినది నెరవేరు వరకు ప్రార్థించుటను దేవుడు మనకు అప్పగించియున్నాడని నమ్మాలి.

గోజాడే ప్రార్థనల గురించి ఒక దైవజనుడు ఈ విధంగా వ్రాస్తున్నాడు. "పట్టుదల కలిగిన ప్రార్థన ఇది ఎంత లోతైన పరలోక మర్మము. ఆశీర్వాదమును వాగ్దానము చేసి, ఇచ్చుటకు ఆశ కలిగి నిశ్చయమైన ఉద్దేశ్యమును కలిగి ఉన్న దేవుడు దానిని పట్టుకొనియున్నాడు. కొన్ని సమయములలో మనం, మన మూలపురుషుడు యాకోబులా ఉండాలి. అతను దేవదూతతో "నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నిన్ను పోనియ్యను" అని చెప్పాడు. దేవుడతనితో నీవు దేవునితోనూ, మనుష్యులతోనూ పోరాడి గెలిచితివి గనుక నిన్ను ఆశీర్వదించాను అన్నాడు (ఆది 32:24-28)

**పట్టు విడువని విధవరాలు:-**

గోజాడు ప్రార్థనకు బైబిల్ లో ఉన్న ఒక ఉత్తమమైన ఉదాహరణ లూకా 18:1-6 **"వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉండు ఒక న్యాయాధిపతి ఉండెను. ఆ పట్టణములో ఒక విధవరాలును ఉండెను. ఆమె అతని యొద్దకు తరచుగా వచ్చి - నా ప్రతివాదికిని నాకును న్యాయము తీర్చుమని అడుగుచు వచ్చెను గాని, అతడు కొంత కాలము ఒప్పకపోయెను. తరువాత అతడు - నేను దేవునికి భయపడకయు, మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉండినను, ఈ విధవరాలు నన్ను తొందరపెట్టుచున్నది గనుక ఆమె మాటి మాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని తనలో తాననుకొనెను. మరియు ప్రభువు ఇట్లనెను. అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి చెప్పిన మాట వినుడి".** ఈ ఉపమానములో యేసు అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి విసిగి న్యాయము తీర్చినపుడు

తనకు దివారాత్రము మొఱ్ఱపెట్టువారికి నీతి ప్రేమ గల దేవుడు దయచేయలేడా ? మనం ఊహించు వాటి కంటే ఎక్కువగా ఇవ్వగలడు. మనం గోజాడినట్లయితే పరిస్థితులు నిరాశాకరంగా లేక సమస్యలు అధిగమించలేనివిగా కనిపించినప్పటికీ మనం పట్టుదలతో ప్రార్థించినట్లయితే గెలవగలము.

**"దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పం చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని ఎరుగుదుము"** అని రోమా 8:28 చెప్తుంది. మనం ప్రార్థనలో పట్టు వదలకుండా ఉన్నట్లైతే మన జీవితములలో ఏమి జరిగినప్పటికి సమస్తము - అవి ఎంత చెడ్డవైనప్పటికీ దేవుని జ్ఞానములో పని చేసి మన మేలుకై సమకూడి జరుగుతాయి.

**"దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱ పెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా ? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడు అయినను మనుష్యకుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమి మీద విశ్వాసము కనుగొనునా ?"** అని యేసు చెప్పుచున్నాడు (లూకా 18:7-8)

విషాదం క్రమ్మినప్పుడు విసుకక ప్రార్థించుట ద్వారా, ప్రార్థనను కొనసాగించుట ద్వారా గందరగోళమైన పరిస్థితులను దేవుడు అద్భుతకరంగా మార్చడం మనం గమనించాలి. పట్టుదలతో ప్రార్థన అసాధ్యమైన వాటిని సాధ్యం చేస్తుంది. మన ప్రార్థనలలో నిశ్చయత కలిగి ఉండాలని దేవుడు కోరుతున్నాడు. ఏ విషయంలో కూడా మనం ఆశ వదులుకోకూడదని ఆయన కోరుతున్నాడు. నిజానికి, ఆయన వచ్చినప్పుడు ప్రార్థనలో విసుగక కొనసాగించు విశ్వాసం కలిగిన మనుష్యుల కొరకు ఆయన చూచుచున్నాడు.

మనం పట్టుదల కలిగి ప్రార్థించినప్పుడు, మన ప్రార్థనలకు జవాబు ఇవ్వకుండా మనలను నిరాశలలో ఎన్నడూ విడువరు. పట్టుదల కలిగియుండుట అనేది తలబిరుసుతనం కాదు గానీ, ఆత్మీయ బలం, అవసరమైన ఆత్మీయమైన శక్తియై ఉన్నది. ప్రార్థనలో మనం సోమరిగా ఉండకూడదు. కొన్ని సమయములలో దేవుడు - ఒక మలుపు వచ్చువరకూ ధైర్యంగా గోజాడు వారి కొరకు చూస్తున్నాడు.

- (ఇంకా ఉంది) సేకరించబడింది

**గోజాడు ప్రార్థన, మౌనముగా ఉండని ప్రార్థన అది పరలోక ద్వారమును పట్టుదలతో, విశ్వాసంతో, జవాబు వచ్చువరకూ తడుతూనే ఉంటుంది.**

# నీవు ఉన్నట్టా?..లేక ఉండి లేనట్టా?...

మానవుడు ఊహ తెలిసిన నాటి నుండి వృద్ధాప్యం వరకు హద్దులు లేని కోరికల వైపు ప్రయాణిస్తూ, మిక్కిలి ఆయాసంతో ఈ జీవితం తన కొరకు, తన వాళ్ళ కొరకే అన్నట్లు దేవుడు ఇచ్చిన విలువైన జీవిత కాలమును అర్థరహితంగానే ముగిస్తున్నాడు.

“నిజానికి మానవుడు ఎంత కాలం భూమి మీద జీవించాడు అనేది ప్రాముఖ్యం కాదు గాని, ఎంత మంది జీవితములను తన జీవితం ద్వారా ప్రభావితం చెందిస్తూ ఒక మంచి మాదిరిని ఈ ప్రపంచంలోని భావితరముల వారికి పరిచయం చేశాడు, చేస్తున్నాడు అనేది ఎంతో ప్రాముఖ్యం.” పరిశుద్ధ గ్రంథంలో దేవుని ఆమోద ముద్ర పొందిన ఎంతో మంది పరిశుద్ధుల జీవితములు నేటికి మనతో మాట్లాడుతూ, ప్రభావితం చేస్తున్నాయి.

వరుసక్రమంలో చూచినట్లైతే... హనోకు, నోవహు, మోషే, యెహోషువ, కాలేబు, అబ్రాహాము, యోబు, దావీదు, ఏలియా, ఎలీషా, హతసాక్షులుగా నిలిచిన యేసుక్రీస్తుని శిష్యులు, పరిశుద్ధ తోమా, పేతురు, యాకోబు, యోహాను, ఆంద్రెయ, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, యోహాను సోదరుడైన యాకోబు, మత్తీయ, జెలోతే అనబడిన సీమోను, సైఫను, పౌలు వంటివారు నేడు మనకు మార్గదర్శకులుగాను, వీరి సాక్ష్యములు మన ఆత్మీయ అభివృద్ధికి ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

నూతన నిబంధనలో అనగా ప్రస్తుత కాలంలో కూడా యధార్థంగా దేవుని సేవను జరిగిస్తున్న అపోస్తలుల (మిషనరీలు) జీవితములను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**01. బర్తొలొమయి (1682-1719):-** భారతదేశానికి ప్రొటెస్టెంట్ మిషనరీ మొదటి తమిళ నూతన నిబంధన అనువాదం చేసాడు. ‘జిగెన్ బాగ్’ ఆసియాలోనే మొట్టమొదటి ముద్రణాయంత్రం తమిళనాడుకు తెచ్చారు. తమిళంలో మొట్టమొదటి నిఘంటువు, అనేకమైన వ్యాకరణ గ్రంథాలు, మొట్టమొదటి క్యాలెండరు, మొట్టమొదటి కీర్తనల పుస్తకం క్రైస్తవలోకానికి అంకితమిచ్చారు. మొట్టమొదటి బాలికల పాఠశాల స్థాపించారు.

**02. విలియం కేరీ (1760-1834):-** ఆధునిక మిషనరీ పితామహుడు. వృత్తిరీత్యా చెప్పులు కుట్టేవాడు. సిరంపూర్ యూనివర్సిటీ స్థాపకుడు 1800 సం॥ నూతన నిబంధనను 40 భాషలలోకి అనువదించారు. పూర్తి బైబిల్‌ను 20 భాషలలోకి అనువదించాడు. భారత దేశానికి మొట్టమొదటి పొగయంత్రాన్ని తెచ్చి ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో ఉపయోగించారు. ఆసియాలోకెల్లా మొట్టమొదటి వార్తాపత్రికను ప్రచురించాడు. భారత దేశంలో మొట్టమొదటి బొటానికల్ సొసైటీని స్థాపించాడు. సతీ సహగమన నిషేధంలో పాత్ర వహించాడు.

**అతని నినాదం :-** దేవుని నుండి గొప్ప కార్యాలకై ఎదురుచూసేముందు దేవుని కొరకు గొప్ప కార్యాలను చేపట్టు.

**03. హెన్రీ మార్టిన్ (1781-1812):-** హిందీ, పర్షియన్, అరబిక్ భాషల్లో బైబిల్ అనువాదకుడు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదువుకున్నాడు. గణితంలో బంగారు పతకం పొందుకున్నాడు. హిందీ, పర్షియన్, అరబిక్ భాషల్లో ప్రావీణ్యుడు. స్త్రీలకోసం ప్రత్యేక పాఠశాలను ప్రారంభించాడు. భిక్షగాళ్ళకు సువార్తను పంచారు.

**04. అలెగ్జాండర్ డఫ్ (1806-1878):-** భారతదేశంలో మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించాడు. అగ్రకులాలకు చెందిన స్త్రీలకు ప్రత్యేక పాఠశాలను స్థాపించాడు. ఆనాటి సాంఘీక దురాచారాల గురించిన అవగాహన ప్రజల్లో కలిగించాడు.

**05. విలియం గౌడీ (1857-1922):-** బీదలకోసం, అణగారిన ప్రజలకోసం పోరాడాడు. తమిళనాడులోని తిరువేళ్ళురులోను చుట్టు ప్రక్కల దళితులకు స్వేచ్ఛను సాధించి పెట్టాడు. మౌళిక విద్య, గ్రామీణ పాఠశాలలు, సామాన్య ప్రజల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ, ఇవన్నీ అతని సువార్త విధానాల సమగ్ర దృక్పథంలోని భాగాలే.

**06. పండిత రామాబాయి (1858-1922):-** ముక్తి మిషన్ స్థాపకురాలు. ఒక సనాతన బ్రాహ్మణ కుటుంబములో జన్మించింది. సంస్కృతంలోను, హిందూ మత గ్రంథాల్లోనూ ప్రావీణ్యత పొందింది. విధవరాండ్రైన స్త్రీల పోషణకు, విద్యా బోధనకు శారదా సదన్ స్థాపించింది. పూనాలోని కేద్‌గావ్‌లో ముక్తి మిషన్‌ను నెలకొల్పింది.

**07. ఎమ్ విల్సన్ కార్మైకల్ (1867-1951):-** దేవదాసీల పిల్లలకు ఆదరణనిచ్చింది. చిన్న బాలికల కోసం దొనాపూర్‌లో ఆశ్రమం స్థాపించింది. తమిళనాడులో 60 సంవత్సరాలపాటు పరిచర్య చేసింది. తన స్వదేశానికి ఒక్కసారి కూడా తిరిగి వెళ్ళలేదు.

**08. ఇడా సోఫియాస్కడ్డర్ (1870-1960):-** సి.యం.సి స్థాపకురాలు. గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలను స్థాపించింది. స్త్రీల కోసం నర్సింగ్ కళాశాలను ప్రారంభించింది. వెల్లూరులోని క్రిష్టియన్ మెడికల్ కాలేజీ మరియు హాస్పిటల్ సి.యం.సి స్థాపకురాలు.

**09. ఇస్టాన్లీ జోన్స్ (1884-1973):-** సువార్తికుడు మహాత్మా గాంధీకి స్నేహితుడు. క్రైస్తవ ఆశ్రమాలు స్థాపించాడు. సమాజ ప్రయోజనకరమైన క్రైస్తవేతర విధానాల్లో సువార్తను అందించాడు.

**10. సాధుసుందర్‌సింగ్ (1889-1929):-** రక్తం స్రవించే పాదాల అపోస్తలుడు. పంజాబులో ఒక సిక్కు కుటుంబంలో జన్మించాడు. భారతదేశం, టిబెట్, నేపాల్, ఆఫ్ఘనిస్థాన్

దేశాల్లో సువార్తను వ్యాపింపజేశాడు. క్రీస్తు వంటి అతని శ్రమలు ప్రపంచాన్ని... కుదిపేశాయి.

**11. మదర్ థెరిస్సా (1910-1997):-** అనాధల తల్లి. కలకత్తాలో చావసిద్ధంగా ఉన్నవారి కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపించింది. వృద్ధులకు ఒక ఆశ్రమం స్థాపించింది. భారత దేశమంతటా కుష్టువ్యాధిగ్రస్తుల కోసం 81 ఆశ్రమాలు ప్రారంభించి వారికి వైద్యం చేసింది. నోబెల్ బహుమతి మొ॥ అనేక అవార్డులు అందుకుంది. ఆ బహుమానాలు పొందటానికి కారణం యేసుక్రీస్తుని ప్రేమే.

క్రీస్తుని విశ్వసించిన నాటినుండి నేటి వరకు మనము దేవునిలో జీవించిన దినములు లేక సంవత్సరములు ఎంతమందిని ప్రభావితం చేసాయి అనేది మనము చూసుకొనవలసిన అవసరం ఉంది. పైన వ్రాయబడిన భక్తుల జీవితములు ఎంతో మందిని దేవుని కొరకు జీవించడానికి ప్రోత్సాహపరచుచున్నాయి. క్రియలు లేక ఫలములు అనేవి జీవితములో ఏ మాత్రం లేకుండా కేవలం అది మంచిది, ఇది చెడ్డది అని తీర్పులు తీర్చుతూ **"పనికిమాలిన జ్ఞానముతో ఎవరికీ పనికిరాని విశ్లేషణలు చేయడం చెక్కగుర్రం మీద కూర్చుని ఎంతో దూరం ప్రయాణించాము అని భ్రాంతి చెందడం లాంటిది."** తమకు తామే గొప్పవారిగా భ్రమపడుతూ ఎదుటి వారిని భ్రమపరచాలని చూసే వారు ఉన్నట్టా, లేనట్టా.... (లేక) ఉండీ లేనట్టా ......





# బైబిల్ క్విజ్ -42

**(న్యాయాధిపతులు)**

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఏ బండసందులో సమ్సోను నివసించాడు?

**2.** బ్రదికున్నప్పటి కంటే తాను చనిపోయే సమయంలో ఎక్కువ మందిని చంపిందెవరు?

**3.** నక్షత్రములు తమ మార్గములలోనుండి ఎవరికి యుద్ధము చేసెను?

**4.** ఇతడు అతనికి యాజకుడాయెను? ఎవరు ఇతడు?

**5.** మునుకోల కఱ్ఱతో **600**మంది ఫిలిష్తీయులను చంపిన న్యాయాధిపతి ఎవరు?

**6.** తన ఏకైక కుమార్తెను దేవునికి దహనబలిగా ఇవ్వాలని నిర్ణయించుకున్నది ఎవరు?

**7.** డెబ్బదిమంది రాజుల కాళ్లు చేతుల బొటన వ్రేళ్లు కోసిన రాజు ఎవరు?

**8.** ఎడమ చేతి పనిగల రెండవ న్యాయాధిపతి ఎవరు?

**9.** "మనము దేవుని చూచితిమి గనుక నిర్భయముగా మనము చనిపోవుదుము" అని చెప్పిందెవరు?

**10.** సమ్సోను కొదమ సింహాన్ని ఎక్కడ చంపాడు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు **అక్టోబర్ 15వ** తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు **నవంబర్ 2015** పత్రికలో ప్రచురించబడతాయి.

పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్ ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్-41 జవాబులు (న్యాయాధిపతులు నుండి ఇవ్వబడినవి:**

| | |
|---|---|
| 1.యెఫ్తా (11:1) | 2.పూరా (7:10) |
| 3.గిద్యోను (6:17) | 4.బోకీము (2:5) |
| 5. కూషన్రిషాతాయిము (3:8) | 6.బెన్యామీను (21:6) |
| 7.యెరుబ్బయలు(6:31,32) | 8.యూదాగోత్రం (1:2) |
| 9. ఒత్నీయేలు (3:9) | 10. ఇబ్సాను (12:8,9) |

**బైబిల్క్విజ్-41 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:**

సౌజన్య, కవితా మాధురి, రూతు, సుశీల, ఎస్తేరు, విఠల్, సౌజన్య, రాజు ఫ్లోరెన్స్, పాప రమేష్, త్రినాథరావు, ఐజాక్కుమారి.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత:** వాసుదేవరావు, సందీప్, శ్రేయస్, కవిత,సుజాత, టైటస్, ఇందిరాప్రియ, ఇస్సాకు, కృష్ణబాలాజి, జ్యోతి, ప్రియాంక, జయశ్రీ, ప్రసాద్, పుష్పలత, శ్రీలక్ష్మి, సుధావల్లి, ఒలీవషారోన్, కిరణ్‌కుమార్, షాలేం, ప్రసన్నకుమార్, బ్యూలా, మాధురి, చంద్రవర్మ, హెప్సిబా, ప్రేమ్‌కుమార్, జోసెఫ్, స్పర్జన్, యోసేపు, గ్లాడీ, దీవెన, చెన్నకేశవరెడ్డి, సుకుమార్, సాయికుమార్, నవ్య, దివ్యదీపిక, స్వరూప్, అరుణ, రిక్విన్‌రాజ్, పద్మశ్రీ, సలోమి, హోసన్న, రాణి, శేఖర్, ప్రజ్ఞ, రిత్విక్‌కేష్, ఉదయశ్రీ, విజయ్‌కుమార్, విజయకుమారి, అనిత, రామలక్ష్మి, అన్నపూర్ణ, నిర్మల్, రామకృష్ణ, సుష్మ, సైమన్, సృజన్, లక్ష్మి, కీర్తి, శిరీష, వెంకటరాములు. వనిత, ప్రత్యూష, నిర్మల, గౌతమి, షైనీజ్యోతి, ఉషారాణి, విజయ, సాల్మన్‌రాజ్, ఫిలిప్, మాధవి, ప్రసన్నరాణి, నవీన్‌కుమార్, అభిజ్ఞ, స్రవంతి, హర్షిత, సుహాసిని,శ్యామ్, పూర్ణజ్యోతి, సాహిత్, సాల్మన్‌రాజ్, శామ్సన్, యేసుబాబు, ప్రగతి, మేరి, ఆదిలక్ష్మి, జ్యోత్స్న, దీపిక, మనీష్‌బాబు, విజయ్‌రాజు, సత్యనారాయణ, షారోన్, త్రివేణి, ప్రియదర్శిని, చంద్రకళ, విజయలక్ష్మి, శ్రీధర్, నిస్వార్థ్, సాయికస్తూరి, ప్రదీప్‌కుమార్, ప్రణీత్‌కుమార్, మల్లేశ్వరి, సూర్యరాజు, రవికుమార్(మిర్యాలగూడ)

**చింతల్:** కృష్ణవేణి, సుధాకర్, సోనురాజ్, ప్రసాద్, శ్యామ్‌శేఖర్, కళ్యాణ్, ఎఫ్రాయిము, రాజేష్, రాజు, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, త్రిమూర్తులు, భవాని, దుర్గాప్రసాద్, వేణుకుమారి, శ్రీహర్షవర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, శేఖర్, సాగర్, నరేంద్ర, ప్రమీల, విశేష.

**అనాజ్‌పూర్:** వరప్రసాద్,కళ్యాణ్‌కుమార్, రామారావు, సుష్మ, మమత, చంద్రకళ

**ఇ.సి.ఐ.ఎల్:** సుజని

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

**2015, ఆగష్టు 15వ తేదీలో జరిగిన ఉపవాస ప్రార్థనలో పాల్గొనిన దేవుని ప్రజలు**



2015, ఆగష్టు 15వ తేదీలో జరిగిన ఉపవాస ప్రార్థనలో దేశమును గురించి ప్రార్థించుచున్న కార్యక్రమములో పాల్గొనిన విశ్వాసులు





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras